క్లుప్తంగా

నేడు శ్రీవారి 53వ వార్షిక కల్యాణ మహోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్ నందు గల అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ దైవం అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి దేవాలయ 53వ వార్షికోత్సవ సందర్భంగా ఈ నెల 24న ఉదయం 10:30 గంటలకు శ్రీవారి కల్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీవారి అనుగ్రహ ప్రాప్తిని పొందాలని కోరారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



సత్తెనపల్లి: వేసవి ఎండల నుంచి చిరు వ్యాపారులు, చర్మ కారులకు రక్షణ కల్పించడం కోసమే గొడుగులను పంపిణీ చేస్తున్నామని జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. పట్టణంలో ఆదివారం రోడ్డు కిరువైపులా చిరు వ్యాపారం చేస్తున్న చర్మ కారులు, చిరు వ్యాపారులకు అభయ ఫౌండేషన్ హైదరాబాద్ సహకారంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో ఆదివారం గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం ఎండలను సైతం లెక్క చేయకుండా కష్టపడుతున్న వారిని చూసి వారికి రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో ఉచితంగా గొడుగులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ మాట్లాడుతూ మండు టెండ్లను సైతం లెక్క చేయకుండా పొట్ట కూటి కోసం జీవనం సాగిస్తున్న రోడ్డు పక్కన పేద, చిరు వ్యాపా రులు వారికి చేయూతను అందించిన అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్ర స్వామీజీ సేవలు నిరుపమానమన్నారు. జన చైతన్య సమితి వ్యవస్థాపక లు దాసరి విజయ్ బెన్నీ బాబు మాట్లాడుతూ అతి తీవ్రంగా ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ రోడ్ల కిరువైపులా చిరు వ్యాపారాలు చేసుకుంటున్న నిరుపేదలకు ఎండ వేడి నుంచి కాస్త ఉపశమనానికి, వడదెబ్బకు గురి కాకుండా వారి ప్రాణాలను కాపాడడానికి గొడుగులు కావాలి అని బాలచంద్ర స్వామీజీని అడిగిన వెంటనే గొడుగులు ఇచ్చారని పేదలకు ఈవిధంగా నైనా సేవ చేసుకునే భాగ్యాన్ని తమకు కల్పించారన్నారు. కార్యక్రమంలో విజయ్ భాస్కర్,చంద్రగిరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి



నకరికల్లు: వేసవికాలం వడగాల్పులు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నకరికల్లు పీహెచ్‌సి డాక్టర్ వి.శ్రీనునాయక్ సూచించారు. ప్రధానంగా ఇతరగ్రామాలకు మిర్చికోతలకు వెళ్లే కూలీలు వేడిమి నుంచి బయటపడకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందన్నారు. పగలు 11గంటల తర్వాత 4గంటలలోపు బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సివస్తే తలపై టోపి, కళ్లకు జోళ్లు, కాటన్‌దుస్తులు ధరించి వెళ్లాలన్నారు. నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లను ఎక్కువగా తినాలన్నారు. తరచూ దప్పిక ఉన్నాలేకున్నా పరిశుభ్రమైన మట్టికుండ నీటిని సేవించాలన్నారు. విపరీతమైన తలనొప్పి, శరీరం వేడి, చమటపట్టడం, కళ్లతిరగడం, నీరసం, కండరాల నొప్పులు లాంటి లక్షణాలు కన్పిస్తే వడదెబ్బగా భావించి సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు.

28 నుంచి జిల్లా తాళం భజన పోటీలు



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో బ్రహ్మంగారి 84. వ ఆరాధన సందర్భంగా ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయిలో తాళం భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వంశ పారంపర్య ధర్మ కర్త చింతాడ లలితాంబ మాతాజీ ఆదివారం తెలిపారు. భజన పోటీల్లో పాల్గొనదలచిన సమాజములవారు ఈ నెల 26వ తేదీలోగా తమ ఎంట్రీలను పంపి పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద వరుసగా రూ. 5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు నగదు అందించటం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొనే ప్రతి సమాజమునకు రూ. 500 జ్ఞాపిక అందిస్తామన్నారు. భజన పోటీలలో పాల్గొనే సమాజములకు వసతి, భోజన సౌకర్యములు ఆశ్రమములో కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. వివరాలకు భజన పోటీల కార్య నిర్వాహక వర్గ సభ్యులు అయ్యప్ప రామచంద్రరావు 9392320367, చల్లా కృష్ణ రెడ్డి 9000130957, కిల్లంపల్లి ఉమాదేవి 9849770 272, నంబర్లను సంప్రదించాలన్నారు.

అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

మంత్రి అంబటి రాంబాబు



ప్రజా ప్రతినిధులతో, అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రాంబాబు

రాజుపాలెం: త్వరలో అభివృద్ధి పనులు పునః ప్రారంభించాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అధికారులను ఆదేశించారు. మండలంలోని దేవరంపాడు దేవస్థానంలో ప్రజా ప్రతినిధులతోను, అధికారులతోను దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి అంబటి మాట్లాడుతూ దేవస్థానంలో జరుగు తిరుణాళల సందర్భంగా సుమారు రెండు నెలలు అభివృద్ధి పనులు ఆగిపోయాయని, వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కల్యాణ మండపానికి రెండవ అంతస్తుకు స్లాబు వేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఐదు అంతస్తుల రాజగోపురం నిర్మించేందుకు, భక్తులు సేదతీర్చుకునేందుకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు, వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈఓ గుర్రం శ్రీనివాసరెడ్డికి సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్, సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ కొండ్రెడ్డి సుజాతపరమేష్, ఈఓ గుర్రం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసేవారికే మద్దతివ్వండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



కోనూరులో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: గత నాలుగేళ్లకాలంలో కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందజేశామని మంచి చేసే వారికి మరొక్కసారి మద్దతివ్వాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంలో మండలంలోని కోనూరులో ఆదివారం సాయంత్రం ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అమలవుతున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేశారు. ఏఇంటికి ఎంత లబ్ధిచేకూరిందో వివరించారు. సమస్యల తక్షణ పరిష్కారం కోసం అధికారులకు తగు సూచనలిచ్చారు. సంక్షేమ పథకాలు మొత్తం యథావిధిగా కొనసాగాలంటే మంచి చేసే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అబద్దాలతో మోసం చేయాలనుకునే ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలన్నారు. 30 సంవత్సరాల కాలంలో జరగని అభివృద్ధి, సంక్షేమం గత నాలుగేళ్లలో జరిగిందని చెప్పారు.

కోనూరులో రూ.15 కోట్ల సంక్షేమాభివృద్ధి

గత నాలుగేళ్లలో కోనూరులో రూ.15 కోట్ల సంక్షేమాభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబిదారుల బ్యాంకు ఖాతాలకు రు.12కోట్లు జమకాగా రూ.3కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.1.43కోట్లు, జగనన్న అమ్మఒడి ద్వారా రూ.1.68 కోట్లు, రైతు భరోసా క్రింద 419 మంది రైతులకు రూ.1.69కోట్లు, సంక్షేమ సాయం అందించామన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక క్రింద 466 మంది నిరుపేదలకు రూ.4.16 కోట్లు వారి ఇళ్లకు వెళ్లి అందించడం జరిగిందన్నారు. నాడు-నేడు ద్వారా రూ.85 లక్షలతో పాఠశాలల రూపురేఖలు మార్చినట్లు చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి రూ.58 లక్షలతో మంచినీటి కుళాయిలు ఇచ్చే పనులు చేపట్టామన్నారు. రూ.50 లక్షలతో అంతర్గత రహదారులు నిర్మించినట్లు చెప్పారు. రూ.40లక్షలతో సచివాలయ భవనం, రూ.17.50లక్షలతో హెల్త్ క్లినిక్ భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, గ్రామ సర్పంచ్ నీలాంబరం, వైఎస్ ఎంపీపీ గంగసాని బాబు, ఎంపీటీసీ యండ్రపల్లి నటరాజు, గ్రామపార్టీ కన్వీనర్ శ్రీనివాసరావు,సొసైటి మాజీ చైర్మన్ తుమ్మా చిన్నపరెడ్డి, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, మాజీ సర్పంచ్ వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, రామిశెట్టి రంగయ్య, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీంబాబు గ్రామ పార్టీ నాయకులు పసుపులేటి జనార్ధనరావు, మత్సా శ్రీనివాసరావు, గుడేటి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండవ రోజు గడపగడుకు

కోనూరులో రెండవరోజు గడపగ డపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం కూడా జరుగనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావలసినదిగా ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



హాజరైన సోషల్ మీడియా కార్యకర్తలు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంను చేయడమే ధ్యేంగా, పెదకూరపాడులో వైఎస్సార్ సీపీ జండాను ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. గుంటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం జరిగిన సోషల్ మీడియా కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు ఐడీ కార్డులు, టీ షర్టులు, డైరీలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ గెలుపులో సోషల్ మీడియా కార్యకర్తల పాత్ర చాలా కీలకమైనదన్నారు. మనమంతా ఒకే కుటుంబమని, మనందరి ఆశయం జగనన్నను మళ్లీ సీఎం కావడమేనని చెప్పారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా తాను ముందుంటానన్నారు. 2019లో పచ్చ మీడియాను అడ్డం పెట్టుకుని టీడీపీ ఎన్నో కుట్రలు పన్నిందని, వాటిని సోషల్ మీడియా బద్దలు కొట్టిందన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. గత నాలుగేళ్లలో పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.2వేల కోట్ల సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. ఈ విషయాన్ని నిర్భయంగా, నిశ్శంకోచంగా చెప్పుకునే దమ్ము, ధైర్యం ఒక్క వైఎస్సార్ సీపీ కార్యకర్తలకే ఉందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో మరో సారి వైఎస్సార్ సీపీ జండా రెపరెపలాడాలని ఎమ్మెల్యే సతీమణి నంబూరు వసంతకుమారి పేర్కొన్నారు. పార్టీ గెలుపులో తనతోపాటు కార్యకర్తలంతా కలిసి రావాలని కోరారు. విపక్షాలు ఎన్ని అబద్దాలు చెప్పినా అసత్య ప్రచారాలు చేసినా, తొణక కుండా, బెణకకుండా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే నంబూరు శంకరరావును మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే తనయుడు కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, నియోజకవర్గ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ పనులు ప్రారంభం

అచ్చంపేట: మాదిపాడు సరిహద్దులోని కృష్ణా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు రాగా త్వరలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే డీపీఆర్ పనులు పూర్తికాగా ప్రభుత్వం రూ.65 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేయించింది. త్వరలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. కాగా భూసేకరణకుగాను మండల సర్వేయర్ శ్రీకాంత్, ఆర్అండ్‌బి ఏఈ పున్నారావు ఆదివారం సర్వే జరిపి మార్కింగ్ ఇచ్చే పనుల్లో నిమగ్నమైనారు. పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల రాకపోకలను, వ్యాపార లావాదేవీలను కొనసాగించేందుకు ఎన్నో రోజులుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో సీయం జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదించగా నిర్మాణ పనులు మే నెలలో ప్రారంభం కానున్నాయి.

ప్రశాంతంగా గురుకులంలో ప్రవేశానికి పరీక్షలు



సత్తెనపల్లి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం రాత పరీక్షలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం, బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. బాలుర గురుకుల కేంద్రంలో ఐదో తరగతి ప్రవేశానికి 276 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 226 మంది హాజరయ్యారు. 50 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి 126 మంది హాజరు కావాల్సి ఉండగా 111 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. అలాగే బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి 171 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 151 మంది హాజరుకాగా 20 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి 214 మంది హాజరు కావాల్సి ఉండగా 189 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల నిర్వహణలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా గురుకుల పాఠశాల ప్రిన్సిపల్స్ ఓ జాన్సన్, కెఐఎస్‌వి స్వర్ణకుమారీలు పర్యవేక్షణ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఉత్తమ ఫలితాలు



ప్రకృతి వ్యయసాయంపై అవగాన ర్యాలీ చేస్తున్న

క్రోసూరు: ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయం చేయాలని, దీనివల్ల సాగు పెట్టుబడులు తగ్గుతాయని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సైదయ్య సూచించారు. ఆదివారం ప్రకృతి వ్యవసాయం కార్యక్రమంలో (ఏపీసీఎంఎస్‌పి) లో భాగంగా దొడ్లేరు గ్రామంలో రాబోయో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారు చేసే కార్యక్రమంలో భాగంగా వనిత గ్రామ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాస్టర్ ట్రైనీ సైదయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు వేసవికాలంలో నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి సారవంతమవుతుందని, తరువాత వేయబోయో ప్రధాన పంటకు వ్యాధినిరోధక శక్తి లభించడం వల్ల ఎటువంటి చీడపీడలు ఆశించవని అన్నారు. దాని వల్ల రైతులకు పెట్టుబడి తగ్గుతుందని, ఎటువంటి పోషక లోపం లేని పంటలు లభిస్తాయని తెలియచేయడం జరిగింది. ప్రతి ఒక్క రైతు తనకున్న మొత్తం భూమిలో నవధాన్యావిధానాన్ని అవలంబిండం నేర్చుకోవాలని సూచించారు. గ్రామంలోని స్వయం సహాయ గ్రూపు సంఘాల ద్వారా రైతులను గుర్తించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హాజరాబీ, సీసీ కనిగిరి వెంకటరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్వయం సహాయ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

నదిలో మునిగి వృద్ధుడి మృతి



మృతి చెందిన మహబుల్లాఖాన్

అమరావతి: ఆనందంగా రంజాన్ పండుగ చేసుకుని సరదాగా ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి అమరావతి వచ్చిన గుంటూరు శారదాకాలనీకి చెందిన పఠాన్ మహబుల్లాఖాన్ ప్రమాదవశాత్తు కృష్ణానదిలో మునిగి మృతి చెంది కుటుంబ సభ్యులకు విషాదాన్ని మిగిల్చాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు గుంటూరు శారదాకాలనీకి చెందిన పఠాన్ మహబుల్లాఖాన్(53) శనివారం రంజాన్ పండుగ జరుపుకుని ఆదివారం సరదాగా తొమ్మిది మంది కుటుంబ సభ్యులతో కలిసి అమరావతి అమరేశ్వర స్నానఘాట్‌కు చేరుకున్నారు. ఈక్రమంలో ఘాట్ కొంతదూరంలో కృష్ణానదిలో స్నానంచేయడానికి తొమ్మిదిమందిలో పఠాన్ మహబుల్లాఖాన్‌తో పాటుగా మరో ఇద్దరు నదిలోకి దిగారు. ప్రమాదవశాత్తులో లోతులోకి వెళ్లడంతో ముగ్గురు మునిగి పోతుండడంతో ఒడ్డుమీద ఉన్న మిగతావారు రక్షించమని కేకలు వేయడంతో అక్కడకు సమీపంలో ఉన్న పడవ నడిపే వ్యక్తి వచ్చి ముగ్గురిలో ఇద్దరిని కాపాడి ఒడ్డుకు చేర్చాడు. అప్పటికే నదిలో పఠాన్ మహబుల్లాఖాన్ మునిగిపోయాడు పోలీసులకు సమాచారం అందించడంలో గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా ప్రమాదం జరిగిన ప్రదేశానికి కొద్దిదూరంలో మృతదేహాన్ని వెలికితీశారు. పఠాన్ మహబుల్లాఖాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు తరలించారు. అమరావతి పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంగా కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్

- 11 ద్విచక్ర వాహనాలు రెండు ఆటోలు సీజ్
- పట్టణంలోని హోటల్స్, లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు
- పూదోట గ్రాండ్ హోటల్‌లో అసాంఘిక కార్యకలాపాలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ బి. ఆదినారాయణ ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌లోని పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జామున మూడు గంటలకే పట్టణ సీఐ యూ శోభన్ బాబు నేతృత్వంలో ఎస్ఐలు, పోలీసుల బృందం పట్టణంలోని రంగాకాలనీలో కార్డెన్ సెర్చ్ లో భాగంగా ఇంటింటి తనిఖీలు నిర్వహించారు. డాక్యుమెంట్లు సక్రమంగా లేని 11 ద్విచక్ర వాహనాలను, 2 ఆటోలను సీజ్ చేశారు. అనంతరం పట్టణంలోని అన్ని హోటల్స్, లాడ్జిలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. నరసరావుపేట రోడ్ లోని పూదోట గ్రాండ్ హోటల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువురు మహిళలు, ఇరువురు విటులు ఉండగా నలుగురు పై కేసు నమోదు చేశారు. ప్రేమికులైన ఇంజనీరింగ్, బీ-ఫార్మసీ విద్యనభ్యసించే విద్యార్థులు, విద్యార్థినిలు ఉండటంతో వారికి కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరికలు చేశారు. పూదోట గ్రాండ్ హోటల్ నిర్వాహకుడు పూదోట రాజు ఏ-1గా, సూపరవైజర్ వెంకటేశ్వర్లు ఏ-2గా వ్యభిచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. పూదోట రాజు పరారీలో ఉండగా వెంకటేశ్వర్లును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వ్యభిచారంలో పట్టుబడిన వారిలో జానపాడుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉన్నాడు. ఒక డీఎస్పీ, ఒక సీఐ, ఏడుగురు ఎస్ఐలు, 70 మంది పోలీసులు కార్డెన్ సెర్చ్ లో పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



రోగులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, డాక్టర్ ఎండీ నాగోతు ప్రకాశ్

క్రోసూరు: పేదలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరులోని నాలుగురోడ్ల సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మదర్ థెరిస్సా మల్టిస్పెషాలిటీస్ ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యశిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. వచ్చిన రోగులను పరామర్శించారు. ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసిన మదర్‌థెరిస్సా మల్టిస్పెషాలిటీస్ మేనేజింగ్ డైరెక్టర్ నాగోతు ప్రకాశ్‌ను అభినందించారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి హెల్త్‌కార్డులు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 1000 కి పైగా రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్పించారన్నారు. వైద్యశిబిరంలో 150 మంది రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో వైద్యులు గైనిక్ వైద్యులు డాక్టర్ జె.అనూషా, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కె.బ్రహ్మయ్య, పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, క్రోసూరు గ్రామ వైస్ సర్పంచ్ షేక్ మస్తాన్, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, అనుమల శ్రీనివాసరెడ్డి,ప్రజలు హాజరైయ్యారు.

దేశ ఆర్థిక వ్యవస్థలను బీజేపీ కొల్లగొడుతుంది

నకరికల్లు: దేశ ఆర్థిక వ్యవస్థలను కొల్లగొడుతూ దేశపతనానికి కారణమవుతున్న బీజేపీ పాలనను గద్దెదించేవరకు పోరాటం సాగించాలని సీపీఎం పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలో లెనిన్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ యువత లెనిన్ గ్రంథాలను పఠించి అర్థం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, సీపీఎం పార్టీ గ్రామ కార్యదర్శి ఈవూరి అప్పిరెడ్డి, మహిళా కార్యదర్శి దుర్గాబాయి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై భారీ మంజూరు



సబ్సిడీపై మంజూరైన లారీని పూజలు చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరు ఎస్సీ కాలనీకి చెందిన బంకా రోశయ్యకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ 14 టైర్ల బారీలారీ మంజూరు చేయడం జరిగింది. ఈక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేతుల మీదుగా పూజలు నిర్వహించి లారీ పత్రాలను లబ్దిదారుడు బంకా రోశయ్యకు అప్పగించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ సుమారు రూ.60 లక్షల రూపాయల విలువైన 14 టైర్లలారీ 45 శాతం అనగా 27 రూ. లక్షలు సబ్సిడీతో లారీని మంజూరు చేయడం జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల అభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు లక్షలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అత్తలూరు వైఎస్సార్ సీపీ నాయకులు మాదినేని హరిబాబు, దత్తు, బంకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై 'ప్రచారభేరి'



పట్టణంలో ప్రచారభేరీలో సీపీఐ, సీపీఎం నాయకులు

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారభేరిలో భాగంగా సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వడ్డవల్లి మున్సిపల్ ఏరియా, శాలిపేట, వెంకటపతినగర్, యానాదికాలని, పార్క్‌రోడ్, బోయకాలని, కాకతీయ కల్యాణ మడపం సెంటర్, రఘురామ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ, గ్రూప్ సమావేశాలు నిర్వహిస్తూ మైక్ ప్రచారం చేపట్టారు. ప్రచారభేరి కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు, నరిశెటి. వేణుగోపాల్, సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి, పి.యిర్మీయా, సీపీఎం సత్తెనపల్లి పట్టణకార్యదర్శి, ధరణికోట.విమల, వామపక్షాల నేతలు అనుమోలు, వీరబ్రహ్మం, పురుషోత్తం, అవ్వారు, ప్రసాద్, వనమారామారావు, జె.రాజ్ కుమార్, సైదులు, అనంత వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

మాదల(ముప్పాళ్ళ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. మండలంలోని మాదల గ్రామంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి నిరసనగా సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారభేరిలో భాగంగా ఆదివారం మాదలలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ వ్యతిరేక విదానాలను నిరసిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింతపల్లి నాగమల్లేశ్వరరావు, పఠాన్ సైదాఖాన్, గారాజాలయ్య, కందిమళ్ళ సాంబశివరావు, మార్పులవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీ అమ్మ జ్యోతి ఉత్సవాలు ప్రారంభం



కుంకుమ బండ్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని చౌడేశ్వరీ అమ్మవారి ఏకాదశ జ్యోతుల మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభ్యంగన స్నానం, అలంకరణ, పూజాదికాలను నిర్వహించారు. తొలిరోజు ప్రధాన ఘట్టమైన కుంకుమ బండ్ల ఊరేగింపును ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అమ్మ వారి చిత్రపటం అలంకరించిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి స్వయంగా నడిపి ఊరేగింపును ప్రారంభించారు.

పుస్తక పఠనంతో మేలు

చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు పుస్తక పఠనం ద్వారానే జ్ఞానాన్ని సంపాదిస్తారని జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు చెప్పారు. ఆదివారం మండలంలోని వేలూరు గ్రామంలో గుర్రం జాషువా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబాల్లో జరిగే శుభకార్యాల్లో చిన్నారులకు పుస్తకాలను బహుమతిగా ఇచ్చి వారి విజ్ఞాన ఎదుగుదలకు దోహదపడాలన్నారు. పెద్దలు, పిల్లలకు ఇవ్వాల్సిన విలువైన ఆస్తి పుస్తకాలని చెప్పారు. అనంతరం 100 పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు.